

నాలెడ్జ్ సిటీని సందర్శించిన నెదర్లాండ్స్ అంబాసిడర్ మారిసా గెరాడ్స్ తదితరులు

ఇండియాకు ఐటీ హబ్‌గా హైదరాబాద్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంలో హైదరాబాద్ ఇండియాలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు పొందిందని ఇక్కడ పెట్టుబడులకు, ఉపాధికి మంచి అవకాశాలున్నాయని నెదర్లాండ్స్ ఇండియా భూటాన్, నేపాల్ అంబాసిడర్ మారిసా గెరాడ్స్ అన్నారు. బుధవారం ఆమె నాలెడ్జ్ సిటీలోని డచ్‌కు చెందిన జిబియా సిఎంబిటీ, ప్లానెన్ సాఫ్ట్‌వేర్ సంస్థలను సందర్శించారు. జిబియా సీవోవో కిరణ్ మధునాపంతులతో కలిసి డచ్ కంపెనీలలో పని చేస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చానని ఇక్కడ వ్యాపార పెట్టుబడులు విస్తరించేందుకు స్థానికంగా ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడబోతున్నట్లు తెలిపారు.

పాఠశాల స్నాతకోత్సవంలో విషాదం..

● ఎల్బీ స్టేడియం సంపులో పడి యూకేజీ బాలుడి మృతి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్బీస్టేడియంలో పాఠశాల స్నాతకోత్సవానికి వచ్చిన బాలుడు సంపులో పడి మృతి చెందాడు. స్నాతకోత్సవంలో భాగంగా యుకేజీ సర్టిఫికెట్ అందుకున్న బాలుడిని చూసి మురిసిపోయిన తల్లి తండ్రులకు మనోవేదనే మిగిలింది. స్నాతకోత్సవంలో పాల్గొనడానికి ఎల్‌కేజీ విద్యార్థి మహమ్మద్ ఆహిల్(5) తన తల్లి షఫియా సుల్తానా, సోదరుడితో కలిసి వచ్చాడు. మంగళవారం రాత్రి బహుమతి కార్యక్రమం ప్రారంభం అవుతుండగా.. స్టేడియం గేట్ నెంబరు 10, 11 మధ్య బాలుడు తచ్చాడుతూ పక్కనే ఉన్న గోతిలో కాలు పెట్టగా జారి సంపులో పడిపోయాడు. ఆహిల్ కనిపించడంలేదని తల్లి, ఇతరులు వెతుకుతున్నారు. సంపులో చూడగా జారిపడిన ఆనవాళ్లు కనపడడంతో అందులోకి దిగి బాబును బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆహిల్‌ను బషీర్‌బాగ్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.



కార్యక్రమంలో అల్లు స్నేహారెడ్డి, ఆస్పత్రి సీఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల తదితరులు

'రెయిన్‌బో'లో బటర్‌ఫ్లై ఎసెన్షియల్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, మహిళలకు హానికరం కాకుండా ఉండే వస్తువులకు సంబంధించిన బటర్‌ఫ్లై ఎసెన్షియల్‌ను రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రిలో అల్లు స్నేహారెడ్డి బుధవారం ప్రారంభించారు. పిల్లలు, మహిళలకు సంబంధించి పూర్తి ఆర్గానిక్ పదార్థాలతో తయారైన ఉత్పత్తులనే ఇక్కడ అందుబాటులో ఉంటాయని రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదర్శ కాంచర్ల, డాక్టర్ ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మెగా హెల్త్ క్యాంప్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ (లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్) విభాగాల్లో పని చేస్తున్న హోంగార్డ్ ఆఫీసర్లకు నిర్వహించిన మెగా హెల్త్ చెకప్ శిబిరం బుధవారం ముగిసింది. క్యాంపు నిర్వాహకులు, మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ డా. దుర్గేష్ శివ, మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది, సీటీసీ డాక్టర్లు సరిత, సుకుమార్ తదితరులను సీపీ అవినాష్ మహంతి అభినందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నర్సింహ కొత్తపల్లి, పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందితో పాటు వైద్య బృందం పాల్గొన్నారు.

మెడికల్ బిల్లులు అందక జేఎన్‌టీయూ ఉద్యోగుల గగ్గోలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైద్యానికి సంబంధించిన బిల్లులు సమర్పించి నెలలు గడుస్తున్నా మంజూరు చేయకపోవడంపై జేఎన్‌టీయూలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జేఎన్‌టీయూ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తక్షణమే బిల్లులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో మాజీ ఫైనాన్స్ ఆఫీసర్ చంద్రశేఖర్, మాజీ డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రసాద్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన కార్మిక విభాగం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు

బాలానగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఏ. శారదారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని మాజీ మంత్రి కేటీఆర్‌కు పంపినట్లు ఆమె చెప్పారు. కొన్ని సంవత్సరాలుగా కార్మికులకు, కార్మిక నాయకులకు పార్టీపరంగా అవమానాలు జరుగుతున్నాయని, అవమానాలను ఎదుర్కుంటూనే మౌనం వహించానని తన ఆవేదనను వ్యక్తం చేశారు.

విద్య కోసం బడ్జెట్ కేటాయింపులను పెంచాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌ఓ) హైదరాబాద్ జిల్లా 10వ విద్యార్థి మహాసభ బుధవారం జరిగింది. లక్డీకాపూల్‌లోని స్మామాట్ కాంప్లెక్స్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఈ మహాసభలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రముఖ రచయిత డాక్టర్ రాపోలు పాల్గొని మాట్లాడారు. నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జె.మల్లేష్‌రాజ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యాభివృద్ధికి సరిపడా నిధులు మంజూరు చేయలేదని అన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ట్రైబల్ వేల్ఫేర్ అధికారి చందన సర్పే

జాతీయ క్రీడలకు బోయిన్‌పల్లి విద్యార్థులు

బోయినపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ భోపాల్‌లో నిర్వహించనున్న ట్రైబల్ వెల్ఫేర్ జాతీయస్థాయి క్రీడా పోటీలకు తెలంగాణ నుంచి బోయినపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ వాటర్ స్పోర్ట్స్ ప్రభుత్వ అకాడమీ విద్యార్థులు 23 మంది ఎంపికయ్యారు. తెలంగాణ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు చందన సర్పే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, లాలూనాయక్, హెచ్‌డబ్ల్యూఓ నీలిమ, కోచ్ భూపాల్ పాల్గొన్నారు.

కేసు వాపసుకు బెదిరించిన భర్తపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గతంలో పెట్టిన కేసు వాపసు తీసుకోవాలని లేదంటే చంపేస్తానంటూ కట్టుకున్న భార్యను, కుమారుడిని బెదిరిస్తున్న ఓ వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనర్సింహనగర్‌కు చెందిన విజయమ్మ, రామచంద్రయ్య భార్యాభర్తలు. పది నెలల క్రితం రామచంద్రయ్య భార్యను కర్రతో కొట్టాడు. గాయపడ్డ ఆమె కుమారుడు శివశంకర్‌తో కలిసి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. జైలు నుంచి వచ్చాక రామచంద్రయ్య భార్య పిల్లలతో ఉంటున్నాడు. ఇటీవల తనపై పెట్టిన కేసును విత్‌డ్రా చేసుకోవాలని భార్యపై ఒత్తిడితేవడం మొదలుపెట్టాడు. భార్య ఊరేళ్లిన సమయం చూసుకొని కుమారుడిని చంపేస్తానంటూ బెదిరించాడు. విజయమ్మ ఫిర్యాదుమేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.

కుత్బుల్లాపూర్ ఓటర్లు 7,12,759

● నేడు తుది జాబితా విడుదలకు రంగం సిద్ధం



ఓటరు జాబితా ప్రతులను సిద్ధం చేస్తున్న ఎన్నికల సిబ్బంది

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల (పార్లమెంట్ ఎన్నికల)కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల పరిశీలన, వాటిలో కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై చర్చిస్తున్నారు. ప్రస్తుతం ఓటరు జాబితాపై దృష్టి సారించారు. ఇటీవల ముగిసిన సాధారణ ఎన్నికల అనంతరం డిసెంబర్ 17వ తేదీ వరకు అందిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని ఇప్పటికే సార్వత్రిక ఎన్నికల కోసం ఓటరు ముసాయిదా జాబితాను (డ్రాఫ్ట్ రోల్) అధికారులు జనవరి 6న విడుదల చేశారు. తాజాగా డిసెంబర్ 17 నుంచి జనవరి 22వ తేదీ వరకు అందిన నూతన ఓటరు నమోదు (ఫారం-6), తొలగింపులు(ఫారం-7), మార్పులు, చేర్పులు (ఫారం-8) ప్రాతిపదికన ఓటరు తుది జాబితాను విడుదల చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు.

7 లక్షలు దాటిన కుత్బుల్లాపూర్ ఓటర్లు

ఇటీవల అంసెబ్లీ ఎన్నికల సమయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 6,99,130 కాగా, వారిలో పురుషులు 3,66,707 మంది, మహిళలు 3,32,264 మంది, ఇతర ఓటర్లు 159 మంది ఉన్నారు. అనంతరం విడుదల చేసిన ఓటరు ముసాయిదా జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 7,06,729 కాగా, వారిలో పురుషులు 3,70,383 మంది, మహిళలు 3,36,186 మంది, ఇతర ఓటర్లు 160 మందిగా నమోదయ్యారు. దీంతో నియోజకవర్గంలోని ఓటర్లు 7 లక్షల మార్కును దాటారు.

తుది జాబితా వివరాలు

గత డిసెంబర్ 17వ తేదీ నుంచి జనవరి 22వ తేదీ వరకు ఫారం-6 కోసం మొత్తం 13,316 మంది నూతన ఓటర్లు దరఖాస్తు చేసుకోగా, వాటిలో అధికారులు 9,834 దరఖాస్తులను అంగీకరించి పలు కారణాలవల్ల 3,482 దరఖాస్తులను తిరస్కరించారు. అలాగే ఫారం-7 కోసం మొత్తం 6,406 ఓటర్లు దరఖాస్తు చేసుకోగా వాటిలో 5,972 దరఖాస్తులను అంగీకరించి 238 దరఖాస్తులను తిరస్కరించారు. ఫారం-8 కోసం మొత్తం 6,307 ఓటర్లు దరఖాస్తు చేసుకోగా, వాటిలో 5,823 దరఖాస్తులను అంగీకరించి 465 దరఖాస్తులను అధికారులు తిరస్కరించి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశారు. దీని ప్రకారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి గాను ఎన్నికల అధికారులు గురువారం అధికారికంగా విడుదల చేయనున్న ఓటరు తుది జాబితా లెక్కలు ఈ విధంగా ఉన్నాయి... మొత్తం ఓటర్లు 7,12,759 మంది కాగా, వారిలో పురుషులు 3,72,639 మంది, మహిళలు 3,39,962 మంది, ఇతర ఓటర్లు 158 మంది ఉన్నారు.

జనవరి 22వ తేదీ అనంతరం ఫారం-6,7,8ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను ఓటరు తుది జాబితా అనంతరం ఎన్నికల సంఘం అవకాశం కల్పించనున్న అనుబంధ ఓటరు జాబితా (సప్లిమెంటరీ రోల్)లో అధికారులు పొందుపరచనున్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళి



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం, దళిత సంఘాల నాయకులు

ఫతేనగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): డా. బాబా సాహెబ్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ జయంతి సందర్భంగా బుధవారం ఆలిండియా అంబేడ్కర్ సంఘం, దళిత సంఘాల నేతలు గూడ్స్ షెడ్ రోడ్డు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేడ్కర్ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు కర్క నాగరాజు, రాష్ట్ర దళిత నాయకుడు కర్క పెటయ్య, మహిళా నాయకురాలు శారద రెడ్డి, కర్క డాకయ్య, బీసీ నాయకులు బాసెట్టి నర్సింగ్‌రావు, కర్క నర్సయ్య, జగన్ గోపాల్, ఖాన్, భాష, శ్యాం పాల్గొన్నారు.

● రాజుకాలనీ అంబేడ్కర్ భవన్‌లో రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి బాలానగర్ దళిత సంక్షేమ సంఘం సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారుడు నల్లవిల్సన్ అధ్యక్షుడు ఆదిముల్ల రాము, జనరల్ సెక్రెటరీ జీడిమెట్ల రమేష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఫీజులు, స్కాలర్‌షిప్‌ల కోసం ఏబీవీపీ ఆందోళన



కూకట్‌పల్లిలోని జాతీయ రహదారిపై బైఠాయించిన ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా విద్యార్థుల సమస్యలకు మాత్రం పరిష్కారం లభించడంలేదని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కూకట్‌పల్లిలోని జాతీయ రహదారిపై ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనాథ్, ప్రతీక్, పవన్, భరత్, గోపాల్, ఆయుష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో...

కుత్బుల్లాపూర్: తెలంగాణలో ప్రభుత్వాలు మారినా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్స్ అందడం లేదని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మేడ్చల్ జిల్లా కన్వీనర్ నగేష్ అన్నారు. ఏబీవీపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి ఐడీపీఎల్ కూడలిలో ఏబీవీపీ మేడ్చల్ శాఖ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. యూనివర్సిటీల భూముల ఆక్రమణలు కూడా ఆగడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న రూ. 5,312 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్య సమితి సభ్యురాలు మనీషా, కార్యవర్గ సభ్యులు ప్రియాంక, దినేష్, వివేక్, గౌతం, భార్గవి, నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

కొంపల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

గాజులరామారం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్‌లోని రూ.96 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలంయాదవ్, అధికారులతో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. కొంపల్లి కమాన్ నుంచి శివాలయం వరకు రూ. 15లక్షలతో వీధి దీపాల ఏర్పాటు, రూ.76లక్షలతో బీటీ రోడ్లు, రూ. 5లక్షలతో అంగన్‌వాడీ కిచెన్ షెడ్‌కు కేటాయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగయ్యనాయిక్, సీనియర్ నాయకులు బూరుగుబావి హన్మంత్‌రావు, కౌన్సిలర్లు వసంత, కిరణ్, ఫాక్స్ డైరెక్టర్లు మధు, మల్లేష్, సంగీతారెడ్డి, చింతల దేవేందర్‌యాదవ్, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పకు చెందిన పలువురు బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుధాకర్, నేవాహు, దామోదర్, శ్రీను, పద్మ, వరలక్ష్మి, రమేష్, లక్ష్మి, గణేష్ ఉన్నారు.

- నిజాంపేట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి)



యూపీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ

పర్వత్‌నగర్ యూపీహెచ్‌సీలో ఇక నుంచి కుటుంబ నియంత్రణ చేయనున్నట్లు ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షాలిని తెలిపారు. గతంలో కుటుంబ నియంత్రణ కోసం పేట్లబుర్జు ఆస్పత్రికి వెళ్లేవారని, ఇక నుంచి కుటుంబ నియంత్రణ పద్ధతి పర్వత్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని డాక్టర్. షాలిని తెలిపారు.

- అల్లాపూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి)

యానిమల్‌కేర్ సెంటర్ పరిశీలన



యానిమల్‌కేర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని యానిమల్ కేర్ సెంటర్‌ను బుధవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈసందర్భంగా వీధి కుక్కల కుటుంబ నియంత్రణ, యానిమల్‌కేర్ సెంటర్ విధి విధానాలపై సిబ్బందితో చర్చించారు. యానిమల్ కేర్ సెంటర్‌లో కుక్కలకు కుటుంబ నియంత్రణ చేసి వాటిని వేర్వేరు కెనాల్స్ ఉంచి, నాలుగైదు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచి వదిలిపెడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాశినాథ్‌యాదవ్, శివరాజ్‌గౌడ్ యానిమల్ కేర్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

హైదర్‌నగర్: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ అంబేడ్కర్‌నగర్‌లోని హిందు శ్మశాన వాటిక స్థలంలో కొందరు రేకులతో ఫెన్సింగ్ వేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈవిషయం తెలిసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. వేసిన ఫెన్సింగ్‌ను వెంటనే తొలగించాలని పోలీసులకు, ఆయా శాఖ అధికారులను ఆదేశించారు. త్వరలో శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ, అంతర్గత రోడ్లు, వాకింగ్ ట్రాక్, మొక్కలు నాటి ఉద్యానవనంగా మారుస్తామని ఆయన అన్నారు.

షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

హైదర్‌నగర్: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని షిర్డీసాయిబాబా ఆలయ 2వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ పాల్గొని స్వామివారికి ప్రత్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతి సహిత గురుమూల మంత్ర హోమం, 108 కళశాలతో స్వామివారికి రుద్రాభిషేకం, పుష్పార్చన, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.



జీవీ నర్సింహరెడ్డి, ఎ.అరుణకుమారి, ఎస్.తారాకల్యాణి, జీఎన్ శ్రీనివాస్

జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌గా నర్సింహరెడ్డి

● పరీక్షల విభాగం డైరెక్టర్‌గా అరుణకుమారి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నూతన ప్రిన్సిపాల్‌గా జీవీ నర్సింహరెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ కె.విజయకుమార్ రెడ్డి రెక్టార్‌గా నియమితులు కావడంతో వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న నర్సింహరెడ్డిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, యూనివర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్‌గా ప్రస్తుతం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా పనిచేస్తున్న డాక్టర్ అరుణకుమారిని నియమించారు. యూజీసీ హెచ్‌ఆర్‌డీ విభాగం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌ను నియమించగా, ప్రొఫెసర్ ఎస్.తారాకళ్యాణిని అకడమిక్ ఆడిట్ అఫైర్స్ విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమించారు. ఈ నియామకాలన్నీ ఏడాది పాటు లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు అమల్లో ఉంటాయని రిజిస్ట్రార్ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐఐఎం చైర్ ప్రొఫెసర్‌గా హెచ్‌సీయూ ప్రొఫెసర్



విజయ భాస్కర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ విజయ భాస్కర్ మారిశెట్టి, డిప్యుటేషన్‌పై విశాఖపట్నం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) చైర్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ప్రొఫెసర్ విజయ్‌భాస్కర్ ఫైనాన్స్, ఫిన్‌టెక్‌లపై రాసిన పరిశోధన పత్రాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

'16న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి'

ఫతేనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త, కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కార్మికులకు పిలుపు నిచ్చారు. బుధవారం భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులతో కలిసి సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకుడు రాములు, అర్జున్, మధు, మోజెష్, ముఖలింగం, యాదగిరి, ఇస్మారి, గడ్డం మల్లేష్, మహేందర్ గుప్తా, భాస్కర్, నర్సింహ, శంకర్, నాగన్న, అశోక్, శ్యాం, రమేష్ పాల్గొన్నారు.

బాల్కసుమన్‌ను అరెస్ట్ చేయాలి



సీఐ నవీన్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాలానగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ మదన్‌మోహన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం బాలానగర్ సీఐ నవీన్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొండకింది పుష్పారెడ్డి, టీపీసీ కార్యదర్శి జావేద్ అలీ, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, మోహన్‌రెడ్డి, బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టి ప్రసన్నకుమార్, సోషల్ మీడియా కన్వీనర్ గజానంద్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



హోటళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీసీపీ వినీత్

రాయదుర్గం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం కోసం స్టార్‌హోటళ్ల నిర్వాహకులు కృషి చేయాలని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ అన్నారు. బుధవారం స్టార్ హోటళ్ల నిర్వాహకులు, పోలీసులతో డీసీపీ నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు సూచనలు చేశారు. హోటళ్లకు వచ్చే వారికి డ్రగ్స్ వాడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టార్‌హోటళ్ల నిర్వాహకులు, పోలీసులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



శివశంకర్‌నగర్‌లో చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ పనులను బుధవారం డివిజన్ ఏఈ పవన్‌తో కలిసి కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పరిశీలించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు శ్రీను, యాదగిరి గౌడ్, లడ్డు, వేణు, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- ఫతేనగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి)

'పెండింగ్ పనులను పూర్తి చేయాలి'

గచ్చిబౌలి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ స్నేహ షబరీష్, నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, అధికారులతో ఎమ్మెల్యే గాంధీ సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చాలా అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అసంపూర్తిగా ఉన్న పనులను కూడా పూర్తిచేయాలన్నారు. గతంలో డివిజన్ల వారికి నెలకు రూ.8కోట్లు విడుదలయ్యేవని, ప్రస్తుతం రూ.4కోట్లు కూడా విడుదల కావడం లేదని, ఎక్కువ నిధులు మంజూరు చేయాలని జడ్‌సీని కోరారు. నియోజకవర్గంలోని చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల మరమ్మతులు చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్ శాఖల అధికారులతో పాటు నియోజకవర్గంలోని కార్పొరేటర్లు పాల్గొన్నారు.



డీసీ నర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

'సంక్షేమ సంఘం భవనం నిర్మించాలి'

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గురుమూర్తినగర్ బస్తీలో మహిళా మండలి సమావేశాలు, బస్తీ దవాఖానా నిర్వహిస్తున్న ప్రాంతంలో నూతన సంక్షేమ సంఘం భవనాన్ని నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు శివకుమార్, బీసీ సెల్ నాయకుడు వెంకటేష్ కోరారు. గురువారం వారు కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్ నర్సింహకు వినతిపత్రం అందజేశారు.

'పెండింగ్ పనులు పూర్తి చేయాలి'

మియాపూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన స్నేహ షబరీష్‌ను బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పెండింగ్ పనులను పూర్తి చేసి, నిధులు మంజూరైన పనులను త్వరగా చేపట్టాలని ఆయన జడ్‌సీని కోరారు.

'గంగారం పెద్దచెరువును కాపాడండి'

చందానగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గంగారం పెద్దచెరువు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి కోరారు. బుధవారం రంగారెడ్డి కలెక్టర్, రాజేంద్రనగర్ ఆర్డీవో, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. అభివృద్ధి పేరుతో చెరువులో చుక్కనీరు లేకుండా చేసి 8ఏళ్లు అవుతోందని, పెద్దపెద్ద నిర్మాణ సంస్థలు చెరువు స్థలాన్ని ఆక్రమించి, మురుగునీటిని చెరువులోకి వదులుతున్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి దర్యాప్తు జరిపించాలని భాస్కరరెడ్డి విన్నవించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. బుధవారం కూకట్‌పల్లిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఖైతలాపూర్‌లోని ఫ్లైవోవర్ కింద గుర్తుతెలియని వ్యక్తి(55) మృతి చెందగా, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

'కార్మికులకు అన్యాయం జరిగితే సహించం'

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కార్మికులకు అన్యాయం జరిగితే సహించేదిలేదని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నారు. బుధవారం ఆయన షాపూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో శ్రీరాణి బువ్వల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కొన్ని ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికుడు స్వామినాయుడు అనివార్య కారణాల వల్ల డ్యూటీకి పోలేదు. దీంతో యాజమాన్యం అతడికి రావాల్సిన నెలరోజుల జీతం ఇవ్వలేదు. తనకు న్యాయం చేయాలని రవిసింగ్‌ను ఆశ్రయించగా, ఆయన యాజమాన్యంతో చర్చించి కార్మికుడికి రావాల్సిన నెల జీతం రూ. 30వేలు ఇప్పించడంతో హర్షం వ్యక్తం చేస్తూ రవిసింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌చారి, మనోజ్‌కుమార్, అనిల్ కుమార్, సుదర్శన్, జగన్ పాల్గొన్నారు.